# అజ్ఞాతవాసం

కథా నిలయం
3846
శ్రీకాకుళం

ఆకాశం ఏడుస్తున్నది.

యాదగిరి నవ్వుతున్నాడు.

యాదగిరి ఏడవలేక నవ్వుతున్నాడు.

వర్షం కుండపోతగా పడుతున్నది.

యాదగిరి కడుపులో ఆకలి మండిపోతున్నది.

యాదగిరి జీప్ డ్రైవర్.

ఆఫీసర్ మూర్తి ఆఫీసు పనుల మీదే కాకుండా స్వంత పనుల మీద కూడా తిరిగే జీప్ డ్రైవర్ యాదగిరి--

యాదగిరికి నలుగురు పిల్లలు, ఒక పెళ్ళాం, ఒక తల్లి - వాళ్ళందరూ తన దుస్థితికి తార్కాణం.

ఒక చెల్లెలు - తన కర్మకు కారణం.

వీళ్ళందరినీ పోషించటానికి అతనికి వచ్చేది నూట పందొమ్మిది రూపాయలు.

అవికూడా సరిగ్గా రావు. రాకపోవడానికి కారణం ఆఫీసర్. యాదగిరి, ఆఫీసర్ మూర్తి ప్రాపకాన్ని పొందలేక పోయాడు.

యాదగిరి తండ్రి మాత్రం వాటా అడగటం యిష్టంలేక పరలోకం చేరుకుని తమాషా చూస్తున్నాడు.

యాదగిరికి మూడు నెలల నుంచి జీతం లేదు.

ఆఫీసర్ని అడిగితే, యింకా ఎల్.ఓ.పి. రాలేదంటాడు. అంటే జీతాలు రావని అర్థం.

అడ్వాన్సులు అడిగితే, "నువ్వు టెంపరరీ వర్క్ చార్జ్డ్ గాడివి. నీకు అడ్వాన్స్ యివ్వం" అని జవాబు.

మరి ఎలా?

ఎలా ఏమిటి - పస్తు వుండటమే దానికి జవాబు.

అందుకనే యాదగిరి పస్తులు వుంటున్నాడు.

అతనితో పాటు -- అతని మీద ఆధారపడ్డ వాళ్ళంతా పస్తు వుంటున్నారు.

యాదగిరి బయట వర్షంలో తడుస్తూనే ఆలోచిస్తున్నాడు.

తన గుడిసెలో కూర్చున్నా ఈ వాన తగ్గదు - తను తడవకా మానడు.

వానలో తడిస్తే, అతని కడుపులో ఆకలి మంటలు చల్లారవని అతనికి తెలుసు.

కడుపులో మంటలకన్నా, యింకా ఎక్కువగా అతన్ని దహించేవి అతని హృదయంలోని దావాగ్ని జ్వాలలు.

ఆఫీసర్ మూర్తి, యాదగిరిని పెట్టే బాధలు -

తన జీతం గురించి పట్టించుకోడు.

అడ్వాన్సులు యిప్పించడు -

ఆఖరికి తను ఎలా బ్రతకాలో కూడా తేల్చడు.

తనకీ వేరే దిక్కులేకే కదా ఈ ఉద్యోగంలో చేరింది.

రాత్రింబగళ్ళు చాకిరి.

ప్రొద్దున ఆఫీసర్‌గారి అబ్బాయిల్ని స్కూలు దగ్గర దించటంతో తన డ్యూటీ మొదలు.

రాత్రి అమ్మగార్ని సినిమా వదలిన తర్వాత యింటికి చేర్చడంతో తన డ్యూటీ ఆఖరు.

అప్పటి వరకూ పెళ్ళాం లేదు. పిల్లలు లేరు, ఏమీ లేదు.

ఉన్నదల్లా ఆకలీ, బాధా --

కాంపెకెళితే అయ్యగారు భోజనం చేసే హోటల్ ముందు నుంచుని ఆ వాసనలు పీల్చుకోవలసిందే కాని, భోజనం మాత్రం లేదు.

ఎన్నడూ ఓ రూపాయి యిచ్చి, తనని భోంచేయమన్నది లేదు.

ఆయన కడుపు నిండా తింటే, తన ఆకలి కూడా తీరుతుందని ఆయన వుద్దేశ్యం కావును.

చెట్టు క్రింద గడ్డి మేస్తున్న మేక పిల్లను పరుగెత్తుకుంటూ వచ్చి -- పోడవబోయింది ఓ దున్నపోతు.

అప్రయత్నంగా నవ్వు వచ్చింది యాదగిరికి.

మేకపిల్ల ఏం చేసిందని అలా పోడుస్తున్నది దున్నపోతు.

అక్కడే మనిషికీ, పశువుకీ తేడా కనపడవలసింది.

అక్కడే అజ్ఞానానికీ, వివేకానికీ తేడా కనపడేది.

కానీ - ఏదీ ఆ తేడా?

మనిషే సాటి మనిషిని హింసిస్తున్నాడు.

దానికి ముఖ్యకారణం అమ్మగారు వూళ్లోలేని నెల రోజుల్లో ఆఫీసర్ మూర్తి అవసరానికి తన చెల్లెలే కావలసివచ్చింది. మనిషి బీదయితే - మనసు కూడా అంతే అనుకున్నాడు కాబోలు, కాదన్నందుకు కాటు వేయాలని చూస్తున్నాడు.

తన అసహాయస్థితి వల్ల మూర్తిని ఏమీ అనలేకపోయాడు.

అతను ఎప్పుడు దెబ్బతీస్తాడోనని అనుక్షణం భయపడుతున్నాడు.

అయ్యగారికి కావలసినవాడు, తనను తీసివేస్తే వచ్చే ఖాళీలో చేరటానికి సిద్ధంగా వున్నాడు.

వాన వెలిసింది - కానీ అతని ఆకలి మాత్రం తగ్గలేదు.

ఆకాశం స్వచ్ఛంగా వుంది - కానీ అతని హృదయం బరువుగా వుంది.

వాన వెలిసిన తర్వాత వచ్చే ఎండ చాల అందంగా వుంటుంది. ఎంత బాధనయినా యిట్టే నయం చేసి, మనసుని ఆహ్లాదపరచే గొప్పదనం వుందా నీ రెండలో ---

యాదగిరి గుండెల నిండా గాలి పీల్చుకుని - ఒక్కసారిగా వదిలాడు.

ఆదెమ్మ లోపలి నుండి అరుస్తున్నది.....

ఇవాళయినా తిండి గింజలు తెచ్చిపడేయకపోతే - పిల్లలూ, నేనూ అంతా ఆకలితో చచ్చిపోతామని గుర్తుచేస్తున్నది.

తనకీ బియ్యం తెచ్చిపడేయాలనే వుంది. కాని ఎలా?

ఎలాగా? -- ఒక్కటే మార్గం! తిండి గింజలు లేకపోతే ఆకలి బాధతో అందరూ చచ్చిపోతారు తనతో సహా. పీడ విరగడవుతుంది.

కానీ ఆ ఆకలి బాధే తను చూడలేకపోతున్నాడు.

తన పిల్లలే కాలే కడుపులతో, కన్నీళ్ళతో చూస్తుంటే తను భరించలేడు.

దానికి పరిష్కారం ఒక్కటే!

తలా కాస్త విషం తీసుకోవటం --

తనూ, తన పెళ్ళాం - పిల్లలూ అంతా ఏ బాధా లేకుండా సుఖంగా చనిపోవచ్చు.

బ్రతకటంలో లేని సుఖం, చావులో వుండొచ్చు.

అంతే - అదే సరి అయిన పరిష్కారం.

తీరని ఆకలి సమస్యకు అసలయిన పరిష్కారం.

కానీ తనకా పని చేసే ధైర్యం వుందా? అతనిలో ఏదో వణుకు ప్రారంభమయింది.

యాదగిరి ఏదో ఆలోచిస్తూ లేచి నించున్నాడు.

ఆఫీసు ప్యూన్ వస్తున్నాడు.

వాడు నయం.

అమ్మగారి ద్వారా అయ్యగారి ప్రాపకం సంపాదించాడు. వాడు దేనికీ యిబ్బంది పడవలసిన అవసరం లేదు--

"అయ్యగారు పిలుస్తున్నారు" చెప్పి వెంటనే వెనక్కి తిరిగాడు.

ఎందుకో యాదగిరికి తెలుసు - హైద్రాబాద్ కేంప్‌కి వెళ్ళాలి.

ఆ రోజు ఆదివారం.

అయినా సరే, అమ్మగార్ని మరి హైద్రాబాద్ నుంచి తీసుకురావాలి కదా!

పోయిన ఆదివారం ఆవిడ్ని - అక్కడ దింపటం కోసమని, ఏదో ఆఫీస్ పని కల్పించుకుని జీప్‌లో వెళ్ళారు అయ్యగారు -- తను యేమీ మాట్లాడకూడదు కనుక, నోర్మూసుకుని వెళ్ళి వచ్చాడు.

ఇప్పుడు ఈ ఆదివారం ఆవిడ్ని అక్కడనుంచి తేవటానికి వెళ్ళాలి కావల్ను.

ప్రభుత్వం డబ్బు, రాష్ట్రప్రగతి కోసం ఖర్చుపెట్టవలసిన ప్రభుత్వపు సొమ్ము, స్వంతానికి వాడు కోవటానికి సిగ్గు ఎందుకు వుండదో అర్థం కాదు. తినే లంచాలు చాలక కాబోలు, బస్సు చార్జీలు కూడా ఆదా చేయటం కోసం కక్కుర్తి. అంతేకాదు, కాంప్ మీద అత్తగారింటికి వెళ్ళినందుకు సెలవు పెట్టనవసరం లేకుండా ప్రయాణ ఖర్చులు, రోజు భత్యాలు కూడా లాభం.

యిలాటివారు ప్రభుత్వానికే అల్లుళ్ళు.

ఈమాటే పూర్వం తను మనసులో అనుకోబోతూ, ప్రక్కనున్న డ్రైవర్‌తో అంటే - అయ్యగారికి సరాసరి చేరింది.

ఆయన తనని ఉద్యోగంలోనించి తీసివేయాలని చూడటానికి యిదో కారణం.

యాదగిరి లేచి నుంచున్నాడు.

పొడి బట్టలు కట్టుకుని బయల్దేరాడు.

అప్పటికే మూర్తి సిద్ధంగా వున్నాడు.

వాకిట్లో ఎదుకు చూస్తున్నాడు.

"ఏం చేస్తున్నావ్ యింత సేపు?" అన్నాడు.

"నిన్ను పిలిచి గంట అయింది!" విసుక్కున్నాడు.

"బుద్ధిలేకపోతేసరి - ఎన్నిసార్లు చెప్పినా!" కోప్పడ్డాడు.

యాదగిరి మనసులో కోపం వచ్చినా, ఎదురు చెప్పలేదు -చెప్పకూడదు కనుక తల వంచుకుని నిలబడ్డాడు.

"ఆలస్యంగా వచ్చి కూడా మొద్దులా అలా నిలబడతావేం - పద" అన్నాడు మూర్తి కసురుతూ.

జీప్ బయల్దేరింది.

ఎక్కడికో తను అడగకూడదు.

ఆయనే చెప్పాలి.

అయినా మూర్తి ఏం చెప్పలేదు.

జీప్ హైద్రాబాద్ రోడ్డెక్కింది. మూర్తి అదోలా చూశాడు యాదగిరిని.

జీప్ వేగంగా వెడుతున్నది.

యాదగిరి ఆలోచిస్తున్నాడు.

తనకి ఆఖరుకి టి.ఎ.బిల్లులు కూడా త్వరగా రావు.

నరసింహమూర్తని ఒక బకాసురుడు టి.ఎ. బిల్సు చూసే గుమస్తా. లంచాలు తినటంలో దిట్ట.

అతనికి తన ప్రక్కనే కూర్చునే క్లర్కు దగ్గర నుంచి కూడా ముష్టి పడకపోతే ఏ టి.ఎ.బిల్సూ పాస్ చేయడు. ప్యూన్‌లూ, డ్రయివర్లూ, ఒకరనిలేదు. అతనికి తన ఉద్యోగ ధర్మం చేయటానికి కూడా లంచాలు యివ్వాలి. యివ్వటం యిష్టం లేకపోతే - తనకు లాగానే, బిల్లులు పాస్ కావు. ఆఫీసరూ లంచాలు తినటంలో వుద్దండుడు కనుక, అయనకు యి లాటి విషయాలు రిపోర్టు చేసినా పట్టించుకోడు.

దొంగలు దొంగలు వూళ్ళు పంచుకున్నట్టు వుంటుంది.

ఏమిటో ఈ జీవన సరళి!

తను మాత్రం హైద్రాబాద్ వెళ్ళగానే శేషగిరి దుకాణానికి వెళ్ళాలి. అతను ఎరువులు అమ్ముతాడు. ఏ ఎండ్రినో తన కుటుంబాని కందరికీ చాలినంత తీసుకుని వూరు చేరగానే, అందరూ తలా కాస్తా తిని హాయిగా, ఈ చావులకు దూరంగా... కానీ, తనా పని చేయగలడా? యదగిరికి భయమేసింది. చమటలు పట్టినయి.

దాని బదులు ఇలాగే బ్రతుకు ఈడవటం నయమేమో!

"నీకు వుద్యోగం పోతే ఏమవుతుందో తెలుసా?" హాఠాత్తుగా అడిగాడు మూర్తి.

యాదగిరి గుండె ఒక్క క్షణం ఆగింది.

మూర్తి కొంచెంసేపు ఏమీ మాట్లాడలేదు.

"అదేమిటి సార్?" అన్నాడు మళ్ళీ గుండె పని చేయటం ఆరంభించాక.

అదోరకంగా నవ్వాడు మూర్తి.

"నీకు తెలీదా నువ్వు ఏం చేశావో...." గట్టిగానే అన్నాడుమూర్తి.

యాదగిరి మాట్లాడలేదు. తను మాట్లాడితే అనవసరంగా మాటలు పెరగటం తప్ప లాభం లేదని తెలుసు అతనికి.

"నేను ఈ నెలాఖరుతో నిన్ను పింపించేద్దామని ఆలోచిస్తున్నాను" సిగరెట్టు పొగ తాపీగా వదులుతూ అన్నాడు మూర్తి.

"సార్!" గాభరాగా అన్నాడు యాదగిరి.

తను చావలేడు. తనకా ధైర్యం లేదు. కానీ ఈయన బ్రతకనీయడు. ఎలా?

"చిదంబరమని యింకో కొత్త అతను వస్తున్నాడు!" అన్నాడు మూర్తి.

"నా మీద చాల మంది ఆధారపడి వున్నారు సార్! నా నోటి దగ్గరి కూడు తీసివేయకండి సార్! నన్నన్యాయం చేయకండి సార్!" గబ గబా అన్నాడు యాదగిరి.

"ఇందులో నిన్ను నేను అన్యాయం చేసిందేముంది?" - అన్నాడు మూర్తి.

"నాకు వేరే యింకెక్కడా వుద్యోగంకూడాదొరకదు సార్!"

మూర్తి సిగరెట్టు మీద సిగరెట్టు త్రాగుతున్నాడు.

"ఇంతకీ నా తప్పేమిటి సార్!" అడిగాడు యాదగిరి.

"పై ఆఫీసర్లమాట వినకపోవటం, తల తిక్కగా మాట్లాడటం" కసిగా అన్నాడు మూర్తి.

"సార్..." అంటున్న యాదగిరి మాటలు వినపడలేదు.

పెద్ద శబ్దమయింది.

వేగంగా పోతున్న జీప్ టైర్ ఒకటి బరస్టయింది.

యాదగిరి ఎంత కంట్రోల్ చేసినా కుదరక, ప్రక్కనున్న రాళ్ళ గుట్టల మీదుగా ప్రక్కకి విసిరివేయబడి, ఒక క్షణంలో తల క్రిందులయింది.

తలక్రిందులయిన తర్వాత కూడా ఆ వేగానికి, కొంత దూరంగా వెళ్ళి, పెద్ద పెద్ద రాళ్ళ మధ్య బలవంతాన ఆగిపోయింది.

యాదగిరికి ఏం జరిగిందో తెలుసుకునే లోపలే కళ్ళు బైర్లుకమ్మాయి. కళ్ళు తెరిచేసరికి తను పెద్ద పెద్ద బండరాళ్ళమధ్య యిరుక్కుని వున్నాడు. శరీరం తన స్వాధీనంలో లేదు. ముఖం మీద నుంచి రక్తం కారుతున్నది.

బాధగా మూలుగుతూ లేచి కూర్చున్నాడు. చూట్టూ చూశాడు.

అది ఏదో రెండు వూళ్ళ మధ్య ప్రదేశం. అడవిలాగా వుంది. చెట్లు,రాళ్ళ గుట్టలూ తప్ప జనసంచారం ఏ మాత్రం లేదు.

ఒళ్ళు విరుచుకున్నాడు. అప్పుడే చూశాడు జీపు క్రిందపడివున్న మూర్తిని.

యాదగిరి గబ గబా నడిచి, మూర్తి దగ్గరకు వెళ్ళాడు. నడుస్తుంటే కాళ్ళలో ఏ మాత్రం సత్తువ కనిపించలేదు. కళ్ళు తిరిగినట్టయింది. ఒక క్షణం అలా రాయి మీద కూర్చుని కళ్ళు మూసుకున్నాడు. తల మీద నుంచి కారుతున్న రక్తం కంటికి తడిగా తగిలింది.

యాదగిరి ఒక క్షణం ఆగి కళ్ళు తెరిచాడు.

మూర్తి జీపు క్రింద అలానే పడివున్నాడు. స్పృహ వున్నట్టు లేదు. యింకా దగ్గరికి వెళ్ళి చూశాడు యాదగిరి. తలకీ, చేతులకీ బాగా దెబ్బలు తగిలాయి. అతని రెండు కాళ్ళు తలక్రిందు అయిన జీపు క్రింద వున్నాయి. స్పృహ లేదు కానీ, వూపిరి మాత్రం ఆడుతున్నది.

యాదగిరి చుట్టూ చాశాడు.

జనసంచారం లేదు. ఎక్కడా యిళ్ళు కూడా కనపడలేదు.

ఆ సమయంలో వేరే కార్లు కానీ, లారీలు కానీ ఆ రోడ్డు మీద వస్తున్న సూచనలు కనపడలేదు.

మూర్తి ముఖంలోకి చూశాడు.

స్పృహ లేకపోయినా అతని ముఖంలో బాధ స్పష్టంగా కనపడుతున్నది. గుండెలు ఎగిరిపడుతున్నాయి.

యాదగిరి మళ్ళీ అతని వేపు చూశాడు.

మూర్తి ముఖం నిర్మలంగా వున్నా, ఏదో కాఠిన్యం, ఏదో కుత్సితం కనపడింది యాదగిరికి.

అతను తనని సర్వనాశనం చేయాలని చూస్తున్న మనిషి.

తను నిజంగా ఏ తప్పూ చేయక పోయినా అతని అవసరాలు తీర్చనందుకు తననే శిక్షించబోతున్నాడు. తన నోటిదగ్గర కూటిని దూరం చేయాలనుకుంటున్నాడు. తనూ, భార్యా, పిల్లలూ మలమలా ఆకలికి మాడుతుంటే చూడాలని ఉవ్విళ్ళూరుతున్నాడు.

తన జీవితాన్ని నలిపి, నాశనం చేయబోతున్నాడు.

తన బ్రతుకుని కాల రాయాలని చూస్తున్నాడు.

అలాటి వాడు..... అలాటి వాడు...

మృత్యు ముఖంలో కొట్టు మిట్టాడు తున్నాడు.

తను తప్ప అతన్ని రక్షించే వారెవరూ లేరిప్పుడు.

తను ఆయన మీద కసి తీర్చుకోవాలంటే యిదే చక్కని సమయం. మంచి కథ అల్లవచ్చు.

జీప్ టైర్ బరస్టయి ప్రమాదం జరిగింది. ఇద్దరూ బాగా దెబ్బతిన్నారు. కాకపోతే ఆఫీసర్ మూర్తి ప్రమాదవశాత్తూ మరణించాడు. యాదగిరి బాగా దెబ్బలు తగిలినా, బయట పడ్డాడు-తర్వాత రోడ్డు మీద పోయే కారు డ్రైవరో, లారీ డ్రైవరో సమయానికి చూసి ఆదుకున్నాడు. కనుక కనీసం యాదగిరి బ్రతకగలిగాడు.

చక్కటి కథ!

తన కోపం తీరుతుంది. తనని నాశనం చేద్దామనుకున్నవాడిని తనే నాశనం చేయవచ్చు. ప్రక్కనే వున్న రాయి తీసుకుని మూర్తి తల మీద గట్టిగా ఒకటే దెబ్బ - మూర్తి మరణిస్తాడు.

మూర్తి జీపు ప్రమాదంలో రాళ్ళ గుట్ట మీద పడి, తల పగిలి మరణిస్తాడు -- అతని మీద జీపు పడటం వల్ల, మూర్తి బ్రతికే అవకాశం పోగొట్టుకున్నాడు.

పెద్దగా నవ్వాడు యాదగిరి.

అనంత శయనం - దీర్ఘ నిద్ర - మూర్తికి శాశ్వతమైన నిద్ర.

మళ్ళీ నవ్వాడు యాదగిరి.

మూర్తి బలహీనంగా కళ్ళు తెరిచాడు.

దీనంగా చూశాడు యాదగిరిని. బాధగా చూశాడు యాదగిరిని.

యాదగిరి మూర్తికి స్పృహ రావటం గమనించి, యింకా పెద్దగా నవ్వాడు. వికటాట్టహాసం చేశాడు.

"చావు! నీ లాటి వాళ్ళు చావ వలసిందే!" పెద్దగా అరిచాడు.

మూర్తి ముఖంలో మృత్యు భయం స్ఫుటంగా కనపడింది.

కదలబోయాడు - కానీ కదల లేకపోయాడు.

ఏదో అనబోయాడు - కానీ నోట మాట రాలేదు.

యాదగిరి ప్రక్కనే వున్న పెద్ద బండరాయి అందుకున్నాడు. పైకి ఎత్తాడు.

మూర్తి ముఖం భయంతో నల్ల బడింది.

"నా జీవితాన్ని నాశనం చేద్దా మనుకున్నావ్ - యిప్పుడు ఆ అవకాశం నాకు దొరికింది!" మళ్ళీ నవ్వాడు యాదగిరి.

మూర్తి ముఖంలో వణుకు. కళ్ళల్లో ఆవేదన కనపడింది.

యాదగిరి చేతిలోని బండరాయి పైకి ఎత్తి సూటిగా మూర్తి తల మీద వేయబోయాడు.

మూర్తి గొంతు చించుకుని "యాదగిరీ!" అని అరిచాడు పెద్దగా.

ఆ కేక భూమి నుంచి ఆకాశాన్నందుకునేంత కేక - బలిపశువు హృదయం నుంచి అనంతాకాశంలోకి దూసుకుపోయే చావు కేక --

మృత్యువు కౌగిలిలో చేరబోయే ముందు, మానవుడు పెట్టే చావు కేక.

బ్రతుకు ఆఖరి క్షణంలో, అలసిన ప్రాణి పెట్టే ఆక్రందన. మెడ మీద కత్తి వేటు పడుతున్నప్పుడు బలిపశువు చేసే ఆఖరి ఆక్రోశన.

యాదగిరి చేయి అలానే ఆగిపోయింది.

మూర్తి పెట్టిన కేక, కేకలోని చావు భయం. సూటిగా యాదగిరి గుండెలకు తాకాయి.

యాదగిరి కళ్ళకు, మేక పిల్లను పొడవబోయిన దున్నపోతు కనపడింది.

అది పశువు.

దున్న పోతు.

దానికి విచక్షణా జ్ఞానం లేదు.

కానీ తను?

మనిషి!

పశువుకీ - మనిషికీ అదే తేడా.

ఆ తేడా పేరే మానవత్వం!

ప్రతీ మనిషిలోనూ అజ్ఞాతంగా వుండేదే ఆ మానవత్వం!

ఎంత దుర్మార్గం చేద్దామనుకున్నవాడికయినా ఆ మానవత్వం ఏదో క్షణంలో తన అజ్ఞాతవాసం మానేసి - భుజం తట్టి - అతన్ని మేల్కొలుపుతుంది.

తనలో అది లోపిస్తే తనకీ, పశువుకీ తేడా లేదు.

పైకెత్తిన బండ రాయిని ప్రక్కకు విసిరివేశాడు.

గబ గబా ముందుకు వెళ్ళి అతని తల మీద చేయి వేసి జాలిగా, ఆప్యాయంగా అతని జుట్టు సవరించాడు.

తన తల మీద గాయం యిప్పుడు యాదగిరిని బాధపెట్టడం లేదు.